సాక్షి శ్రీకాకుళం

గురువారం । 9 । మార్చి । 2023



సాంబ అ'ధర'హో..!

సాంబ రకం ధాన్యం ధర పెరిగింది. ఖరీఫ్‌లో సన్న రకాల పంట విస్తీర్ణం ధర తగ్గడంతో వ్యాపారులు ఎగబడి కొనుగోలు చేస్తున్నారు. - 8లో



సరికొత్త ఒరవడికి నాంది

సీఎం జగన్ రాజకీయాల్లో సరికొత్త ఒరవడికి నాంది పలికారని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. సామాజిక విప్లవాన్ని తీసుకువచ్చారని పేర్కొన్నారు. - 8లో

నేడే కిరణ దర్శనం

అరసవల్లి: అరసవల్లిలోని ఆదిత్యాలయం గర్భాలయంలో మూలవిరాట్టును సూర్యకిరణాలు స్పృశించే అద్భుత దృశ్యం గురువారం ఉదయం ఆవిష్కృతం కానుంది. ఉత్తరాయణ కాలంలో తొలి సూర్యోదయ కిరణాలు నేరుగా తాకడం ఇక్కడి ఆలయ నిర్మాణ విశిష్టత. ఈ అరుదైన దృశ్యం చూసేందుకు భారీ సంఖ్యలో భక్తులు ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చే అవకాశం ఉండటంతో ఈఓ వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మఏర్పాట్లు చేశారు.

న్యూస్‌రీల్

రెవెన్యూ సర్వీసుల సంఘం ఎన్నికకు నోటిఫికేషన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ సర్వీసుల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేశారు. 2023– 26 కాలపరిమితికి గాను నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు ఈ నెల 26న శ్రీకాకుళం రెవెన్యూ గెస్ట్ హౌస్ వద్ద ఎన్నిక నిర్వహించనున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా రెవెన్యూ సర్వీసుల సంఘం అధ్యక్షుడు జి.శ్రీరామమూర్తిని ఎన్నికల అధికారిగా, పార్వతీపురం డివిజన్ అధ్యక్షులు సూర్యనారాయణ, గోవింద్‌లను ఎన్నికల పరిశీలకులుగా నియమించారు. చైర్మన్, అసోసియేట్ అధ్యక్షుడు, నలుగురు ఉపాధ్యక్షులు (ఒకమహిళ), కార్యదర్శి, ఆర్గనైజింగ్ కార్యదర్శి, స్పోర్ట్సు ఆర్ట్సు కార్యదర్శి, జాయింట్ సెక్రటరీ, ట్రెజరర్, ఏడుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకుంటారు. వీరిని శ్రీకాకుళం కలెక్టరేట్ యూనిట్, శ్రీకాకుళం, టెక్కలి, పలాస రెవెన్యూ డివిజనల్ యూనిట్ ప్రతినిధులు ఎన్నుకుంటారు. ఆదివారం ఉదయం 10 గంటలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై సాయంత్రంతో ముగుస్తుందని సంఘ ప్రతినిధులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్లే కీలకం



మాట్లాడుతున్న పరిశీలకుడు శ్యామలరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని ఎన్నికల పరిశీలకుడు జె.శ్యామలరావు అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మైక్రో అబ్జర్వర్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేయాలన్నారు. రాజకీయ పార్టీల పోలింగ్ ఏజెంట్లు, ఇతర సిబ్బంది హాజరు పరిశీలించాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద ఇబ్బందులు తలెత్తితే ప్రిసైడింగ్ అధికారి దృష్టికి తీసుకురావాలని సూచించారు. మార్చి 12న ఎన్నికల సామగ్రిని పంపిణీ చేస్తామన్నారు. 13న ఖాళీ బ్యాలెట్ బాక్స్‌ను ఏజెంట్ సమక్షంలో తెరిచి పోలింగ్ ప్రారంభించాలని ఆదేశించారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన గుర్తింపు కార్డును తప్పనిసరిగా పరిశీలించాలన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, మైక్రో అబ్జర్వర్లు పాల్గొన్నారు.

జాతీయ బ్యాడ్మింటన్ అంపైర్‌గా శరత్



టి.శరత్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు చెందిన తుంగాన శరత్ జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు అంపైర్‌గా అర్హత సాధించాడు. ఈ మేరకు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(బాయ్) నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. రాజస్థాన్‌లోని రాయ్‌పూర్ వేదికగా ఈ ఏడాది ఫిబ్రవరి 24 నుంచి 28 వరకు లిఖిత, మౌళిక, ప్రాక్టికల్స్ ప్రావీణ్యత పరీక్షలు నిర్వహించారు. దేశవ్యాప్తంగా 120 మంది హాజరుకాగా 27 మంది అర్హత సాధించారు. శరత్ 12వ స్థానంలో నిలిచి శభాష్ అనిపించాడు. శరత్ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా సేవలు అందిస్తున్నారు. ఓవైపు వృత్తి.. మరోవైపు ప్రవృత్తిగా క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారు. శరత్ జాతీయ అర్హత సాధించడం పట్ల డీఈఓ గార పగడాలమ్మ, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ ఆర్.రాజేంద్రన్, అధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్, ప్రధాన కార్యదర్శి మెట్ట అశోక్‌కుమార్, సీఈఓ సంపతిరావు సూరిబాబు, చీఫ్ పేట్రన్ డాక్టర్ గూడేన సోమేశ్వరరావు, గురుగుబెల్లి ప్రసాద్, దామోదర్, అనీల్, సంఘ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

ఉద్దానం కిడ్నీకి రక్షణ కవచం



ఉద్దానం అంటే కొబ్బరి, జీడి తోటలే గుర్తుకొస్తాయి. పరిమళించే పచ్చదనం.. సేదదీర్చే ప్రశాంత వాతావరణమే గుర్తుకొస్తాయి. అయితే ఆ ప్రశాంతత వెనుక గూడు కట్టుకున్న విషాదం ఉంది. గుండెలు పిండేసే కిడ్నీ బాధలు ఉన్నాయి. దశాబ్దాలుగా కబళిస్తున్న కిడ్నీ మహమ్మారిని గత పాలకులు పట్టించుకోలేదు. బాధితులను గాలికి వదిలేశారు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పరిస్థితి మారింది. వ్యాధిగ్రస్తుల పాలిట ప్రభుత్వమే పెద్ద రక్షణ కవచంలా నిలిచింది. డయాలసిస్ కేంద్రాలు, రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుతో పాటు బాధితులకు నిరంతర వైద్య సేవలు, నెల నెలా రూ.పది వేల భృతితో కొండంత అండగా నిలుస్తోంది. భవిష్యత్తుపై భరోసా ఇస్తోంది.

కిడ్నీభూతంపై సర్కారు యుద్ధం

- వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు నిరంతరం స్క్రీనింగ్
- డయాలసిస్ రోగులకు అందుబాటులో సెంటర్లు
- ఉచితంగా 37 రకాల మందులు సరఫరా
- వ్యాధి తీవ్రత బట్టి రూ.10వేలు, రూ.5వేల పింఛన్లు
- నేడు ప్రపంచ కిడ్నీ దినోత్సవం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ఉద్దానాన్ని కిడ్నీ వ్యాధి కబళిస్తోంది. కొన్నేళ్లుగా మరణ మృదంగం మోగుతోంది. ఏ ఊరు వెళ్లినా కిడ్నీ రోగులు కనిపిస్తూనే ఉంటారు. వ్యాధి నియంత్రణకు గత పాలకులు పూర్తిస్థాయిలో దృష్టి సారించలేదు. 2019 వరకు కిడ్నీ వ్యాధిపై పరిశోధనలు, పరిశీలనలకే పరిమితయ్యారు తప్ప వ్యాధి నియంత్రణకు సరైన చర్యలు తీసుకోలేదు. తొలిసారిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక నియంత్రణ చర్యలు చేపట్టారు. ఏకంగా కిడ్నీ వ్యాధిపై యుద్ధమే ప్రకటించారు. ఉద్దానానికి ఆరోగ్య భరోసా కల్పించేందుకు నడుం బిగించారు. ఖర్చుకు వెనకాడకుండా ఏం చేయాలో, ఎన్ని చేయాలో అన్నీ చేస్తున్నారు. నేడు ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

పెరిగిన మందుల సరఫరా..

- టీడీపీ హయాంలో డయాలసిస్ రోగులకు 20 రకాల మందులే అందుబాటులో ఉండేవి. ఇప్పుడు 37 రకాల మందులను అందుబాటులో ఉంచారు. అవసరమైతే ఇంకా మందులు కొనుగోలు చేసే వెసులుబాటును అక్కడి అధికారులకు ప్రభుత్వం కల్పించింది.
- కిడ్నీ రోగులకు వైద్య పరీక్షల కోసం సెమీ ఆటో ఎనలైజర్స్, ఎలక్ట్రోలైట్ ఎనలైజర్స్, యూరిన్ ఎనలైజర్స్‌ను ఉద్దానం పరిధిలో ఉన్న 29 ల్యాబ్‌లలో అందుబాటులో ఉంచారు. పాతవి పాడైతే ఎప్పటికప్పుడు కొత్తవి కొనుగోలు చేసి అందుబాటులోకి తీసుకొస్తున్నారు.
- టీడీపీ హయాంలో జిల్లా నెఫ్రాలజీ విభాగమే లేదు. ఈ ప్రభుత్వం వచ్చాక శ్రీకాకుళం జీజీహెచ్‌లో నెఫ్రాలజీ విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించారు. ప్రతీ శనివారం పలాస సీహెచ్‌సీలో సేవలుందిస్తున్నారు.





పలాసలో శరవేగంగా నిర్మితమవుతున్న కిడ్నీ రీసెర్చ్ సెంటర్, ఆస్పత్రి



ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు నీలాపు కేదారి. ఇచ్ఛాపురం మండలం సన్యాసిపుట్టుగకు చెందిన ఈయన పదేళ్లుగా ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. నాలుగేళ్లుగా మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎటువంటి వైద్య సహాయం అందకపోవడంతో బరంపురం, విశాఖపట్నంలోని కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకుని లక్షల రూపాయల అప్పుల పాలయ్యారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో వచ్చాక మందుల ఖర్చులకు నెలకు రూ.5వేలు ఇవ్వడంతో కొంత ఆర్థిక భారం తగ్గింది. ఏడాదిన్నర నుంచి సోంపేటలో డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఇప్పుడు నెలకు రూ.10 వేలు పింఛన్‌తో పాటు ఉచితంగా మందులు అందిస్తున్నారు. వారానికి మూడు సార్లు 108 సిబ్బంది 22 కిలోమీటర్ల దూరంలో ఉన్న సోంపేటకు తీసుకెళ్తున్నారు.

పింఛన్లతో ఆసరా..

టీడీపీ ప్రభుత్వంలో రూ.3,500 పింఛన్‌ను ఇచ్చేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక దానిని రూ.10వేలకు పెంచారు. వ్యాధి తీవ్రత ఆధారంగా సీరం క్రియేటినైన్ 5కుపైబడి ఉన్న వారికి రూ.5వేలు, డయాలసిస్ రోగులకు రూ.10వేల పింఛన్ ఇస్తున్నారు. ఈ లెక్కన 393 మందికి రూ.10వేలు చొప్పున, 367 మందికి రూ.5వేలు చొప్పున పింఛన్లు ఇస్తున్నారు.



వజ్రపుకొత్తూరు మండలంలో కిడ్నీ బాధితురాలికి రూ. 10 వేలు పింఛన్ అందజేస్తూ.. (ఫైల్)

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

- మూత్ర పిండాలను జాగ్రత్తగా కాపాడుకోవాలి. ఎంత ఎక్కువ నీరు తాగితే ఆరోగ్యానికి అంత మంచిది.
- పెయిన్ కిల్లర్ వినియోగం తగ్గించాలి.
- మద్యం, సిగరెట్లు అధికంగా తాగడం వల్ల శరీరంలో టాక్సిన్లు పెరుగుతాయి. మూత్ర పిండాలకు రక్త ప్రవాహం తగ్గుతుంది. దీనివల్ల కిడ్నీలపై ఒత్తిడి పెరిగి, వాటి పనితీరు మందగిస్తుంది.
- అధిక బరువు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- రక్తంలో సుగర్ లెవెల్స్ అధికంగా ఉంటే కిడ్నీలకు వడపోత క్లిష్టంగా మారుతుంది. బీపీ కారణంగా శరీరంలో రక్తం ప్రవహించే వేగం పెరుగుతుంది. కిడ్నీలకు వేగంగా రక్తం రావడం వల్ల ఫిల్టర్లు దెబ్బతినే ప్రమాదం ఉంది.

బాధితులకు అండగా..



ఓ వైపు వ్యాధి మూలాలు కనుగొనేందుకు కిడ్నీ రీసెర్చ్ ఆస్పత్రిని నిర్మించడం, మరో వైపు వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యంతో పాటు డయాలసిస్, ఉచిత మందులను పూర్తిస్థాయిలో అందించడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది.



ఇంకోవైపు వ్యాధి ప్రబలడానికి ప్రధాన కారణం తాగునీరై ఉండొచ్చన్న నిపుణుల సూచనల మేరకు రూ.700కోట్లతో భారీ మంచినీటి పథకాన్ని నిర్మిస్తోంది. పథకం అందుబాటులోకి వస్తే ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల పరిధిలోని ఏడు మండలాల్లో 807 గ్రామాల్లో 7,82,707 మందికి ఇంటింటికీ కుళాయిల ద్వారా నిరంతరం స్వచ్ఛమైన తాగునీరు అందనుంది. దీనికోసం వంశధార నుంచి 1.12టీఎంసీల వినియోగించనున్నారు. 84 ఎంఎల్ ఫిల్టర్ సామర్థ్యంతో 571 ట్యాంకుల ద్వారా ఊరూరు తాగునీరు అందించనున్నారు. 50 కిలోమీటర్ల పొడవునా మైగా పైపు లైను నిర్మించి, వాటి కింద మరో 134.818 కిలోమీటర్ల పైపులైన్ వేసి ఇంటింటికీ నీరందించే పనులు చివరి దశకు చేరుకున్నాయి. కిడ్నీ వ్యాధి మూలాలను తెలుసుకునేందుకు రీసెర్చ్ సెంటర్‌తో పాటు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కూడా మంజూరు చేశారు. రూ.50కోట్ల వ్యయంతో చేపడుతున్న పనులు దాదాపు పూర్తి కావొచ్చాయి. త్వరలోనే ప్రారంభించనున్నారు.

ఉద్దానం పరిధిలో కిడ్నీ ప్రభావిత గ్రామాలు	187
కిడ్నీ వ్యాధిపై పరీక్షలు చేస్తున్న కేంద్రాలు	29
కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు	6
అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు	5
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	18
హెల్త్ వెల్‌నెస్ సెంటర్	85
వైద్యుల సంఖ్య	71
ల్యాబ్ టెక్నీషియన్ల సంఖ్య	34
మెడికల్ మేనేజ్‌మెంట్‌పై ఉన్న కిడ్నీ రోగులు	19,532
డయాలసిస్‌పై ఉన్న రోగులు	468

సంవత్సరం	పరీక్షలు	వ్యాధి నిర్ధారణ
2018	12,452	792
2019	92,292	5,070
2020	12,029	310
2021	8,733	114
2022	7,813	517

పెంచిన డయాలసిస్ సేవలు..



ఆసుపత్రిలో రోగులకు డయాలసిస్

- ప్రస్తుతం టెక్కలి, పలాస, సోంపేట, కవిటి, హరిపురం ఆసుపత్రుల్లో డయాలసిస్ సెంటర్లు ఉన్నాయి. 63 మెషిన్లతో 68 పడకలపై డయాలసిస్ సేవలు అందిస్తున్నారు.
- సోంపేట సీహెచ్‌సీ డయాలసిస్ సెంటర్లలో గతంలో 13 పడకలుండేవి. ఇప్పుడు వాటి సంఖ్య 19కి పెంచారు.
- కవిటి సీహెచ్‌సీ డయాలసిస్ సెంటర్లలో గతంలో 10 పడకలుండేవి. ఇప్పుడవి 15కి పెరిగాయి.
- హరిపురంలో కొత్తగా 10 పడకలతో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేశారు.
- కొత్తగా గోవిందపురం, అక్కుపల్లి, కంచిలి, బెలగాంలో డయాలసిస్ సెంటర్లు మంజూరయ్యాయి.
- ఇవి కాకుండా ఇచ్ఛాపురం సీహెచ్‌సీలో 10 పడకలు, బారువ సీహెచ్‌సీలో 10 పడకలతో డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.
- రెండు కంటైన్డ్ బేస్డ్ సర్వీసెస్ డయాలసిస్ యూనిట్లను సైతం ఏర్పాటు చేశారు. ఒక్కొక్క యూనిట్లలో ఏడేసి పడకలు ఉన్నాయి.

2022 డిసెంబర్ 31 వరకు జరిగిన పరీక్షలు

మండలం	ఇచ్ఛాపురం	కవిటి	కంచిలి	సోంపేట	మందస	పలాస	వజ్రపుకొత్తూరు
పరీక్షలు చేసుకున్న వారు	15,099	42,385	24,042	39,757	44,529	32,519	34,567
గుర్తించిన రోగుల సంఖ్య	1168	3963	2479	2742	4442	2046	2692

పింఛన్‌తో భరోసా



కిడ్నీ సమస్య ఉందని, డయాలసిస్ చేసుకోవాలని ఏడాది క్రితం వైద్యులు సూచించారు. దీంతో పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ చేసుకుంటున్నాను. ఐదు నెలలుగా రూ.10 వేలు పింఛన్ వస్తుంది. మందులు, ఇతర ఖర్చులకు పింఛన్ కొంత వరకు సరిపోతుంది.

– పి.కుసమయ్య, కిడ్నీ బాధితుడు, పెద్దబొడ్డపాడు, వజ్రపుకొత్తూరు

సర్కారు అండతో..



కూలి పనులు చేసుకుంటూ జీవనోపాధి సాగిస్తున్న నేను రెండేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాను. జగనన్న పుణ్యమా అని నాకు రూ.5వేలు పింఛన్ గత నెల వరకు వచ్చేది. ప్రస్తుతం మరో రూ.5 వేలు పింఛన్ అదనంగా ఈ నెల నుంచి వస్తుంది. ఈ మొత్తంతో కొంత వరకు ఆర్థిక ఇబ్బందులు తీరుతున్నాయి.

– సిర్ల కాంతమ్మ, పింఛన్ లబ్ధిదారు, వజ్రపుకొత్తూరు

వైభవం.. వెంకన్న చక్రతీర్థ స్నానం





హిరమండలం మేజర్ పంచాయతీ పరిధిలోని సుభలయ మెట్ట (తపోగిరి)పై వెలసిన వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు బుధవారం చక్రతీర్థ స్నానాలు వైభవంగా నిర్వహించారు. దోలోత్సవాల ముగింపు సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి ప్రధాన అర్చకులు బృందావన పండా ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను వేదమంత్రాలు, మేళతాళాలతో ఊరేగింపుగా సమీపంలో ఉన్న వంశధార నదిలోకి తీసుకువెళ్లి చక్రతీర్థ స్నానాలు చేశారు. – హిరమండలం





ఆత్మబంధువుకు అభిషేకం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం నరసన్నపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మహిళల ఆత్మబంధువుగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న జగనన్న ఆదరణను మరువలేమంటూ మహిళా ప్రతినిధులు కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, రాష్ట్ర వెలమ, శ్రీశయన, పొందర కూరాకుల కార్పొరేషన్ చైర్‌పర్సన్లు పంగ కృష్ణవేణి, చీపురు రాణి, రాజాపు హైమావతి, సుడా చైర్‌పర్సన్ కోరాడ ఆశాలత, జెడ్పీటీసీ చింతు అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలోనూ మహిళా ప్రజాప్రతినిధులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి పాల్గొన్నారు. – నరసన్నపేట/శ్రీకాకుళం పీఎన్ కాలనీ

క్లుప్తంగా

నేడు కిమ్స్‌లో కిడ్నీ ఉచిత వైద్య శిబిరం

అరసవల్లి: జిల్లా కేంద్రంలోని కిమ్స్ ఆస్పత్రిలో ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా గురువారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు యాజమాన్యం ప్రకటించింది. ఈ శిబిరంలో కిడ్నీ వ్యాధి వైద్య నిపుణులు డాక్టర్ శరత్‌జ్యోత్స్న, బెందాళం గౌతమి బృందం పాల్గొంటుందన్నారు. ప్రత్యేక పరీక్షలపై 50 శాతం రాయితీ కల్పిస్తున్నామని, రోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగ్గురికి గాయాలు



క్షతగాత్రులకు సపర్యలు చేస్తున్న కానిస్టేబుల్

శ్రీకాకుళం క్రైమ్: పట్టణంలోని బృందావనం దరి ఆనందమయి ఫంక్షన్ హాల్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడినట్టు ట్రాఫిక్ ఎస్సై ఎస్.ఎస్.దొర తెలిపారు. ఆనందమయి ఫంక్షన్ హాల్ వద్ద నరసన్నపేట మండలం గోపిపెంటకు చెందిన చిన్నాల్ల వెంకటరమణ తన ద్విచక్ర వాహనంపై మలుపు తిరుగుతుండగా.. అరసవిల్లి మిల్లు జంక్షన్ నుంచి కలెక్టరేట్ వైపు వెళ్తున్న కార్తీక్ (19) ద్విచక్ర వాహనంతో ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ఈ సమయంలో కార్తీక్ వెంట అతని బావమరిది ఉన్నాడు. ఈ ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. వెంకటరమణ తలకు, నుదురుపై గాయాలవ్వడంతో మాట్లాడలేకపోతున్నాడు. కార్తీక్, అతని బావమరిదికి చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

30 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న బియ్యం బస్తాలతో ఉన్న వ్యాన్, డ్రైవర్

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి గోపినాథపురం సమీపంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. బొలేరో వ్యాన్‌లో అక్రమంగా బియ్యం తరలిస్తున్నారనే సమాచారం మేరకు వాహనాన్ని తనిఖీ చేయగా సుమారు 30 బస్తాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. దీంతో బియ్యాన్ని, వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నామని విజిలెన్స్ ఎస్సై బి.రామారావు తెలిపారు. బియ్యం సంతబొమ్మాళికి చెందిన కె.చిన్నమ్ముడుకు చెందినవిగా గుర్తించామని.. వాటివిలువ సుమారు. రూ.50 వేలు ఉంటుందన్నారు. డ్రైవర్ కోరాడ శశికుమార్‌ను అదుపులో తీసుకుని కేసు నమోదు చేశామన్నారు.

టీకాలతోనే గాలికుంటు నివారణ

గార: పాడి పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశువైద్యాధికారి జి.సుభాష్ చంద్రబోస్ సూచించారు. బుధవారం అంపోలులో పశువులకు ఉచితంగా టీకాలు వేశారు. ప్రతి రైతు భరోసా కేంద్రం ఆధ్వర్యంలో టీకాలు వేస్తారని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150–00
బంగారం(22సి. 10గ్రా.)	51,800–00
వెండి (కిలో)	71,200–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹120	₹195	₹ 215

సాంబ అధరహో..!

- ధాన్యం ధరలకు రెక్కలు
- బియ్యానిదీ అదే తోవ
- ఖరీఫ్‌లో తగ్గిన పంట విస్తీర్ణం



సాంబ వరి చేను (ఫైల్)

నరసన్నపేట: జిల్లా వ్యాప్తంగా సన్న రకం ధాన్యానికి రెక్కలు వచ్చాయి. ప్రధానంగా సాంబ ధాన్యాన్ని మిల్లర్లు ఎగబడి అధిక ధర వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. పండిన కొద్దిపాటి ధాన్యాన్ని తమ అవసరాలకు నిల్వ చేసుకున్న రైతులు అమ్మేందుకు ముందుకు రావడం లేదు. దీనిని గమనించిన మిల్లర్లు రైతులను ఊరించే విధంగా ధర ఆశ చూపుతున్నారు. వాస్తవానికి గ్రేడ్ 'ఏ' రకంగా నిర్ధారించిన సాంబ క్వింటా బస్తా ధర 1648 రూపాయలుగా ఉంది. అయితే మిల్లర్లు కేవలం 80 కేజీల బస్తాను రూ. 2 వేలకు కొనుగోలు చేస్తున్నారు. ఈ ధరలు మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నాయని మిల్లర్లు, వ్యాపారులు అంటున్నారు. అలాగే సన్న రకాలుగా పిలిచే సోనా మసూరి, శ్రీకాకుళం సన్నాలు, ఆర్ఎస్ఆర్ వంటి ధాన్యం ధరలు కూడా అధికంగానే ఉన్నాయి.

–భారీగా తగ్గిన విస్తీర్ణం

జిల్లా వ్యాప్తంగా ఐదు లక్షల ఎకరాల్లో వరిని ఖరీఫ్‌లో రైతులు సాగు చేయగా దీంట్లో కేవలం 80 వేల ఎకరాల్లోనే సాంబతో పాటు ఇతర సన్న రకాలు వేశారు. 2021లో చూస్తే 1.30 ఎకరాల వరకూ సాగు చేశారు. అధిక శాతం ప్రభుత్వం కొనుగోలు చేస్తామన్న రకాలనే రైతులు పండించారు. అలాగే సాంబతో పాటు ఇతర సన్న రకాలకు తెగుళ్లు, పురుగు బెడద అధికంగా ఉండటంతో రైతులు ఈసారి అంతగా ఆసక్తి చూపలేదు. దీంతో సన్న రకాల ధాన్యం దిగుబడి బాగా తగ్గింది.

అమాంతంగా పెరిగిన బియ్యం ధరలు

బియ్యం ధరలు అమాంతంగా పెరిగాయి. సన్నాల్లో సాంబ (సీసీ) బియ్యం ధర ఎక్కువగా ఉంది. నరసన్నపేటలో జనవరిలో 25 కేజీల బియ్యం రూ. 1200 ఉండగా ప్రస్తుతం రూ. 1380 పలుకుతుంది. ఈ నెలాఖరుకల్లా రూ. 1500 వరకూ పెరగవచ్చని వ్యాపారవర్గాలు చెబుతున్నాయి. దీంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు జోక్యం చేసుకొని సీసీ బియ్యం ధరలు పెరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సన్న రకాలు దొరకడం లేదు



జిల్లా వ్యాప్తంగా సన్న రకాల ధాన్యం సాగు విస్తీర్ణం తగ్గింది. అలాగే సాంబకు తెల్లదోమ అధికంగా సోకడంతో దిగుబడి పడిపోయింది. పండిన కొద్దిపాటి ధాన్యాన్ని రైతులు తమ అవసరాలకు ఉంచుకున్నారు. దీంతో ఈ రకం ధాన్యం అందుబాటులో లేదు. ఇతర జిల్లాలనుంచి దిగుమతి చేస్తున్నాం. వచ్చే సీజన్‌లో అయినా రైతులు అన్ని రకాలు సమానంగా పండించాలి.

– తంగుడు జోగారావు, జిల్లా రైస్ మిల్లర్ల సంఘం మాజీ అధ్యక్షుడు, నరసన్నపేట

గురుకులాల మాజీ సమన్వయకర్తపై చర్య తీసుకోవాలి

- జేసీకి దళిత సంఘాల ప్రతినిధుల వినతి



జేసీని కలిసిన దళిత సంఘాల నాయకులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల మాజీ సమన్వయకర్త వై.యశోదలక్ష్మిపై చర్య తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఏడు నెలలుగా విచారణ పేరుతో కాలయాపన చేయడం సరికాదన్నారు. తక్షణమే ఆమెపై ఉన్నతాధికారులకు నివేదిక పంపించి చర్యలు తీసుకోవాలని కోరుతూ జేసీ ఎం.నవీన్‌ను తన చాంబర్‌లో బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. అలాగే ఇచ్ఛాపురం మండలం మశాకాపురం గ్రామంలో దండాసి కులస్తులు వెళ్లే దారిలో నవగ్రహాల గుడి నిర్మాణం పేరుతో అడ్డంగా గోడ కడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పలాస మునిసిపాలిటీ పరిధిలో దళితుల డీ పట్టా భూములను ఆక్రమిస్తున్నారని..సంబంధిత వ్యక్తులపై చర్య తీసుకోవాలని కోరుతూ ఆ మండల తహసీల్దార్‌కు పలుమార్లు వినతులు అందజేసిన పట్టించుకోవడం లేదని జేసీ దృష్టికి తెచ్చారు. పొందూరు మండలం దళ్లవలస గ్రామంలో దళితుల నివాసాలకు సమీపంలో డంపింగ్ యార్డు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఈ సమస్యను గతంలో కూడా అధికారుల దృష్టికి తీసుకొచ్చామని.. సమస్యలను పరిష్కరించాలని కోరారు. జేసీని కలిసిన వారిలో దళిత సంఘాల జేఏసీ నాయకులు డి.గణేష్, మిస్కా కృష్ణయ్య, చల్లా రామారావు, రాకోటి రాంబాబు, నవిరి లక్ష్మణ్, నవిరి నీలాచాలం, దివ్వాల మల్లేశ్వరరావు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో స్వామి కోలసేవ



సముద్రతీరంలో భక్తుల సందడి

మందస: ఉద్దానం భక్తులతో కళకళలాడింది. ఏటా సంప్రదాయబద్ధంగా జరిగే రట్టి వల్లభనారాయణుని యాత్రకు భక్తులు బుధవారం పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఒడిశా నుంచి కూడా భక్తులు డోలోత్సవానికి వచ్చారు. భేతాళపురం పంచాయతీలో గల రట్టి గ్రామంలోని శ్రీవల్లభనారాయణుడు ఉద్దాన ప్రాంత ఆరాధ్యదైవం. మందస సంస్థానాన్ని పరిపాలించిన రాజులు సుమారు 250 సంవత్సరాల క్రితం ఈ ఆలయం నిర్మించగా, అప్పటి నుంచి ఆలయంలో ప్రతీ ఏటా మూడు రోజుల పాటు జాతర జరుగుతుంది. ఈ నెల 2వ తేదీ నుంచి స్వామి వారి డోలోత్సవం ప్రారంభం కాగా, చివరి రెండు రోజుల పాటు భారీ ఎత్తున యాత్ర జరుగుతుంది. డోలోపౌర్ణమి సందర్భంగా వల్లభనారాయణస్వామిని దూర తీరాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రముఖులకు ఆలయ సంప్రదాయాలతో గౌరవించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా మందస పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. సంప్రదాయంగా వస్తున్న సముద్ర స్నానాన్ని భక్తులు చేశారు. రట్టి బీచ్ వద్ద మెరైన్ పోలీసులు నిఘా వేశారు. బుధవారం రాత్రి స్వామి కోలసేవను నిర్వహించారు. కోల పలికించిన తరువాత స్వామికి పూజలు చేశారు. అనంతరం డోలోత్సవాలు ముగిసినట్లు అర్చకులు చెప్పారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కన్నుల పండువగా కామదహనోత్సవం



చక్రధరస్వామి సన్నిధిలో కామదహనోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కవిటి: బెజ్జిపుట్టుగలో వెలసిన శ్రీదేవీ, భూదేవీ సమేత పెరుమాళ్‌స్వామి డోలోత్సవాలు బుధవారం వేకువజామున కామదహనోత్సవం, వసంతోత్సవం, డోలోరోహణంతో ముగిశాయి. 14 రోజుల పాటు సాగిన ఉత్సవాల్లో చివరి రోజున కాముని దహనం అనంతరం ఉభయదేవేరులతో కలిసి దేవదేవుని తిరువీధి ఉత్సవం నివ్వాలిపాటలతో కమనీయంగా నిర్వహించారు. ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా శ్రీదేవీ భూదేవీసమేత చక్రధరపెరుమాళ్‌పస్వామికి ఆభరణాలంకార సేవ చేపట్టారు. ఈ ఏడాది పండిన పనస, మామిడి పండ్లతో ప్రసాద నివేదన చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు పొందల కృష్ణారావు, పొందల శ్రీరాంబాబు, పొందల విజయకృష్ణ పాల్గొన్నారు.

● హోలీ.. రంగుల్లో తేలి..



జిల్లా వ్యాప్తంగా బుధవారం హోలీ సంబరాలను ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. ముఖ్యంగా చిన్నారులు, యువత రంగులు పూసుకుని సందడి చేశారు. ఒకరికొకరు హోలీ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఎల్.ఎన్.పేట మండలం తురకపేట సెంటర్‌లోని ఎస్‌వి స్కూల్ ప్రాంగణంలో చిన్నారులు హోలీ సంబరాలను ఇక్కడ చూడొచ్చు.

– ఎల్.ఎన్.పేట

వైభవంగా ఊయల సేవ



ఉత్తరాభిముఖంగా దర్శనమిస్తున్న శ్రీదేవి, భూదేవి సమేతగోవిందరాజస్వామి

గార: శ్రీకూర్మనాథ క్షేత్రంలో మూడు రోజుల పాటు జరిగిన డోలోత్సవంలో చివరి ఘట్టమైన ఊంజల్ సేవ (ఊయల సేవ) డోలో మంటపంలో బుధవారం ఉదయం వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు ఉభయనాంచారాలతో ఉన్న స్వామివారిని ఉత్తరాభిముఖంగా దర్శించుకుని స్వామి పాదస్పర్శ చేసి పులకించిపోయారు. డోలో మంటపంలో శ్రీకూర్మనాథున్ని ఉత్తరాభిముఖంగా దర్శిస్తే మోక్షమార్గం కలుగుతుందని ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు తెలిపారు. ఉదయం 6 గంటలకు గోవిందరాజస్వామి గజవాహనంపై, ఉభయనాంచారులైన శ్రీదేవి, భూదేవిలు పల్లకి వాహనంపై శ్రీకూర్మం పురవీదుల్లో ఊరేగారు. అనంతరం గ్రామశివారులోని మోహినీ భద్రాంబికా ఆలయం వద్ద ఉన్న డోలో మంటపానికి తీసుకెళ్లి స్వామిని ఉత్తరాభిముఖంగా ఉంచారు. ఉత్సవ సందర్భంగా అమరావతి దేవదాయ ధర్మాదాయ శాఖ డీసీ ఈవీ సత్యం రాజు స్వామిని దర్శించుకున్నారు. గతంలో చేసిన అభివృద్ధి ప్రణాళికపై అధికారులతో చర్చించారు.

ఆర్థికంగా నిలదొక్కుకోవాలి



మహిళలు తయారు చేసిన వస్తువులను పరిశీలిస్తున్న అధికారులు

లావేరు: మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలని నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజరు కె.వరప్రసాద్, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజరు జీవీబీడీ హరిప్రసాద్ అన్నారు. బెజ్జిపురం వైసీబీ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన మహిళలు తయారు చేసిన వస్తు ప్రదర్శనను బుధవారం గ్రామంలో ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి వీలుగా వివిధ రంగాల్లో ఇస్తున్న శిక్షణలను సద్వినియోగం చేసుకొని స్వశక్తితో ఎదగాలన్నారు. కార్యక్రమంలో యూత్‌క్లబ్ అధ్యక్షుడు ఎం.ప్రసాదరావు, కోశాధికారి జి.అప్పలనాయుడు ఉన్నారు.

చెట్టుపైనుంచి పడి గీత కార్మికుడి మృతి



పోలాకి: ఈత చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన దీర్ఘాశి గ్రామంలో బుధవారం చోటుచేసుకోగా గేదెల యర్రయ్య (47) మృతి చెందాడు. యర్రయ్య వృత్తిపరంగా ఈతకల్లు అమ్ముకుని వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. మృతునికి భార్య ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు పోలాకి పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసన్నపేట ఆస్పత్రికి తరలించారు.

కిమ్స్‌లో ఘనంగా మహిళా దినోత్సవం



డీఎంహెచ్‌వో మీనాక్షిని సత్కరిస్తున్న కిమ్స్ యాజమాన్య ప్రతినిధులు

అరసవల్లి: నగరంలోని కిమ్స్ ఆస్పత్రిలో మహిళా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ గూడెన సోమేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారిణి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షిని యాజమాన్యం, వైద్య బృందం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. మహిళలు సహనానికి ప్రతీకలన్నారు. 365 రోజులు మహిళలవేనన్నారు. ఏ సమస్యనైనా ఎదుర్కొనే ధైర్యం ప్రతి మహిళకు ఉండాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ చింతాడ కృష్ణమోహన్, వైద్యులు పి.ఆర్.సోమేశ్వరరావు, స్వర్ణలత, లాస్య, దీపక్, సహజ, గౌతమి, బాలనరిసింగరావు, కిల్లి సతీష్, కల్యాణ్‌చక్రవర్తి పాల్గొన్నారు

రాజకీయాల్లో సరికొత్త ఒరవడికి నాంది



మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

- స్పీకర్ తమ్మినేని సీతారాం
- ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి: మంత్రి బొత్స సత్యనారాయణ



మాక్ పోలింగ్‌లో ఓటు వేసి చూపిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: రాజకీయాల్లో సరికొత్త ఒరవడికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికారని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. సామాజిక.. సాధికారిత విప్లవాన్ని తీసుకువచ్చిన గొప్ప మనసున్న వ్యక్తన్నారు. ఆమదాలవలసలోని ఎస్ఎస్ఎస్ కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, మంత్రి బొత్స సత్యనారాయణ అధ్యక్షతన నియోజకవర్గస్థాయి పార్టీ నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నామినేటెడ్, పార్టీ పదవులతోపాటు అధికారిక సదస్సుల్లో అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యత కల్పించేలా ఇప్పటి వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో ఏ రాజకీయ పార్టీ నిర్ణయం చేయలేదన్నారు. 50 శాతం పదవులను మహిళలకు కేటాయిస్తూ మహిళా సాధికారితకు అర్థం చెప్పిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ నేపథ్యంలో గత సార్వత్రిక ఎన్నికల్లో దురదృష్టవశాత్తు ఓటమి చవిచూసిన నర్తు రామారావుకు స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా ముఖ్యమంత్రి అవకాశం ఇచ్చారన్నారు. వివాదరహితుడు, అనునిత్యం ప్రజాసమస్యలపై స్పందించే గుణం ఉన్న వ్యక్తిగా గుర్తింపు పొందిన రామారావును స్థానిక సంస్థల కోటాలో అత్యధిక ఓట్లతో గెలిపించేందుకు కృషిచేద్దామన్నారు. అలాగే ఈనెల 13న జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ మద్దతు అభ్యర్థిగా బరిలో ఉన్న సీతంరాజు సుధాకర్‌ను కూడా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. విశాఖపట్నంలో కార్యనిర్వాహక రాజధానికి మద్దతుగా పట్టభద్రులంతా సుధాకర్‌కు ఓటు వేయాలని కోరారు. ఉత్తరాంధ్రలో ఉన్న యువతకు 75 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించేదిశగా సీఎం అడుగులు వేస్తున్నారని, అందుకు కార్యాచరణ చేస్తున్నారన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి: మంత్రి బొత్స

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ బలపరిచిన నర్తు రామారావు, పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌లను అత్యధిక ఓట్లు మెజారిటీతో గెలిపించాలని మంత్రి బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. పార్టీ క్యాడరంతా ఒకే తాటిపైకి వచ్చి సైనికుల్లా పనిచేసి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలో స్థానిక సంస్థల కోటాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, స్థానిక ఎమ్మెల్యేతో కలిసి 60 స్థానాలు ఉన్నాయని.. అందులో 40 మంది వైఎస్సార్‌సీపీకి చెందిన వారే ఉన్నారన్నారు. ఆ ఓట్లన్నీ పార్టీ ప్రకటించిన అభ్యర్థికే పడాలని స్పష్టం చేశారు. ఓటు వేసే పద్ధతిని చూపించారు. అలాగే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అధిక మెజారిటీతో గెలిపిస్తే విశాఖలో రాజధాని నిర్మాణానికి మంచి మద్దతు లభిస్తుందన్నారు. నాలుగు మండలాల ప్రతినిధులను సమన్వయం చేసే బాధ్యత నియోజకవర్గ ప్రత్యేక పరిశీలకుడు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుపై ఉందన్నారు. ముందుగా మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే స్పీకర్ తమ్మినేని సీతారాంకేక్ కట్‌చేసి మహిళలకు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసే పద్ధతిపై మాక్ పోలింగ్ నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మామిడి శ్రీకాంత్, పార్టీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, జిల్లా యువజన అధ్యక్షులు మెంటాడ స్వరూప్ పాల్గొన్నారు.

చేయి చేయి కలిపారు.. 'లిఫ్టు' బాగు చేసుకున్నారు



విద్యుత్ బోర్డును ప్రారంభిస్తున్న కృష్ణ చైతన్య

సారవకోట: మండలంలోని బద్రి, గుమ్మపాడు, గోపాలపురం గ్రామాల రైతులు చేయి చేయి కలిపి మరమ్మతులకు గురైన ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేయించుకున్నారు. బద్రి గ్రామంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేశారు. అయితే ఖరీఫ్ తరువాత లిఫ్టుకు ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పాడైంది. దీంతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు విద్యుత్ పానల్స్ ఏర్పాటు చేయాల్సి వచ్చింది. దీని కోసం మూడు గ్రామాల రైతులు రూ 1.50 లక్షలు సేకరించగా పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య మరో లక్షన్నర రూపాయలు సహాయం చేశారు. ఆ నిధులతో లిఫ్టుకు ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు ఇతర ప్యానల్ పనులు చేయించి బుధవారం కృష్ణచైతన్య చేతులమీదుగా పునః ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యుడు మెండ బాలచంద్రరావునాయుడు, కొత్తూరు సర్పంచ్ బాడాన కృష్ణారావు, సచివాలయ కమిటీ మండల కన్వీనర్ నక్క తులసీదాస్, పార్టీ నాయకులు నిక్కు రాజశేఖర్, మోహనదాస్ తదితరులున్నారు.

ఘనంగా రంగుల సంబరం

- డోలో మండపంలో దర్శనమిచ్చిన ఆదిత్యుని ఉత్సవమూర్తులు



ఉత్సవమూర్తులకు హారతినిస్తున్న ప్రధాన అర్చకులు శంకరశర్మ

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి వారు దేవాలయ ఉద్యానవనంలో తన ముగ్గురు దేవేరులైన ఉషా, పద్మిని, ఛాయాదేవిలతో బుధవారం ఉదయం దర్శనమిచ్చారు. డోలోత్సవ సంబరాల్లో భాగంగా హోలీ రంగుల పండుగ సందర్భంగా ఆదిత్యుని ఉత్సవమూర్తులను గ్రామ తిరువీధిగా తీసుకువచ్చి డోలో మండపంలో వేంచేసింపజేశారు. ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఇప్పిలి సాందీప్‌శర్మ, రంజిత్ శర్మ, ఫణీంద్ర శర్మల బృందం ఉత్సవమూర్తులకు ఘనంగా సుమంగళి అర్చనలు నిర్వహించారు. వేద మంత్రాలు, మంగళధ్వనుల నడుమ ఉషాపద్మినిఛాయా దేవేరులతో స్వామి వారి ఉత్సవమూర్తులకు రంగులు చల్లారు, అలాగే భక్తులకు కూడా రంగుల బొట్టును పెట్టి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులతో పాటు అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.